

# పర్యవసానం

బి.వి.ఎన్. స్వామి

ఒక్కొక్కటి పరిశీలించసాగాను.
దుంపడి, తీగదారు, పెద్ది ఏగి,
ఏరుమద్ది, బట్టగణం, బిలుగు,
చెన్న్ంగి, బర్రెంక, బొజ్జ, బండారి,
మొక్కం, ఇప్ప, నారేప, చొప్పరి,
తునికి, ఒడిశ, ఎలక, మొగ,
గమగు, సంద్ర, తడ, తిరుమని,
మొగిలి, చిలకదుద్దురు,
జువ్వి, పూస్కు, తాని,
విషముష్టి.... ఇలా
ఇంకెన్నో!

మహాదేవపూర్ నుండి మొదలయింది అడవి. రోడలూ అడవి. పట్టపగలు నిశ్శబ్దం. ఒళ్లంతా కళ్ళు చేసుకొని అడవిని చూడసాగాను. రోడ్డు బాగా లేకపోవడం వల్ల ఒళ్లంతా హూనం. కంటికే అందని అడవి కలిగించే సంబరం. ఖాళీ కడుపు చేసే పోరాటం. ఏకకాలంలో అనేక అనుభవాలతో సాగిన ప్రయాణం అది. కొన్ని కిలోమీటర్లు పరచుకున్న అడవిలో ఎన్ని రకాల చెట్లో!

నాకు తెలిసినవి కొన్ని, తెలియనివి మరిన్ని. దారి వెంబడి కనిపించే మనుషులు తీరుతెన్నులు, పనిపాటలు, వారి జీవిత విధానాన్ని తెలుపుతోంది. వారి వెనకబడినతనం అక్కడి మనుషుల ధోరణిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకా దట్టమైన అడవిలో వెళ్లసాగాము. తెలియని అభిరుచి ఏదో జీపు దిగేట్లు చేసింది. కాలినడకన దట్టమైన చెట్టలోకి వెళ్లాను. ప్రకృతి పట్ల గల ఆరాధాన, ఆకర్షణ నన్ను మరింత అడవిలోకి తీసుకెళ్లింది. దూరంలో ఏదో జంతువు కదలిన అలికిడి. ఇంత వరకు లేని భయం ఎక్కడి నుంచి వచ్చిందో కానీ, నాలుగడుగులు నన్ను వెనక్కి వేయించింది. అలికిడి నా ఎదుట దృశ్యరూపం ధరించింది. మృగప్రాయంగా వున్న మనిషి. నగ్నంగా దేకుతూ, ఆకలితో మట్టి ముద్ద తింటూ వెళ్లసాగాడు. ఎప్పటివో ప్రాకృతిక మానవుడి అడుగుజాడలు కనపడిన అనుభూతి. కొండగుహల్లో కదలాడిన మొదటి మానవుడి పాద ముద్రలకోసం, చదువుల వేళ వెతికిన జ్ఞాపకాలు ముసురుకొన్నాయి. చిన్నప్పుడు నాయనమ్మ చెప్పిన 'మునుల' తాలూకు కథలు కమ్ముకున్నాయి. నాయనమ్మ చెప్పిన 'ముని'కి నేను చూసిన మనిషికి హస్తిమశకాంతరం. నాకు చెందిన నాస్టాల్జియాలోకి

వెళ్లి వచ్చేసరికి, వర్తమానంలోని మనిషి మాయం. నన్ను వెతుక్కుంటూ మా వాళ్లు వచ్చారు. అందరం కలిసి జీపులో దూరామ. ప్రయాణం మళ్లీ మొదలయింది. ఇందాకటి మనిషి నాలోకి వచ్చి చేరాడేమో! ఆకలి దహించివేయసాగింది. నా వాళ్ళు పెట్టిన సంప్రదాయపు కట్టుబాట్లకు అతీతంగా కడుపునింపసాగాను. తినేవి అటుకులే అయినా, నిండిన కడుపు కలిగించిన తృప్తి అపారం. ఆ తృప్తి అందించిన క్షీణోపాంత ప్రయోజన సూత్రం ఒక వైపు, శ్రీకృష్ణ కుచేలుర కథ మరోవైపు నన్ను ఆక్రమించాయి.

***

''ఇంత ఎత్తేసుట్ల నిద్ర ఎట్ల పట్టింది'' లేపుతూ అంది మా ఆవిడ.

''అలసట, మమేకం... తృప్తి...''

'' ఏందేందో ముచ్చట పెడుతున్నవు, ఏమన్నా గాలిగిన సోకిందా'' అంటూ బలంగా ఊపింది.

కళ్లు తెరిచి చూసాను. జీపు ఆగి ఉంది. జీపులో వాళ్లు అందరూ దిగారు.

''గుడికి పోయి వద్దాం పద'' మా ఆవిడ దారి తీసింది.

''అందరు బయల్దేరింద్రు, తొందరగ నడువు'' తొందరపెట్టింది.

''నేను రాను. మీరు పోండ్రి॥

''ఇంక నిద్ర సరిపోలేదా. మొఖం కడుగు. గుట్టమీదికి పోదాం''

''నిజమే. గుట్టమీదికి పోవాలి ప్రకృతి ఒళ్లోకి మళ్లీ ఒకసారి వెళ్లాలి'' అంటూ బయల్దేరాను.

ఎత్తయిన ప్రదేశం. పైకి వెళ్లడానికి కిందనుండి మెట్లు. మా వాళ్లందరి చేతుల్లో కొబ్బరికాయలు. అక్కడి దేవాలయం విశిష్టత గురించి ఒకరు. గుళ్లోని మూలవిరాట్టు గురించి మరొకరు అక్కడి పూజారి గురించి, అర్చకాదుల గురించి చర్చిస్తూ అందరు మెట్లు ఎక్కసాగారు. వారి వెనుక నేను, అన్యమనస్కంగా మెట్లు ఎక్కుతున్నా నా పాదాలకు తాకిన తడి నన్ను మేల్కొలిపింది. గుళ్లో అడుగిడడానికి ముందు కాలువ నీరు అందుబాటులో ఉండడం, మనిషి ఆధ్యాత్మికతకు చిహ్నంగా అనిపించింది. కాలువ నీరు చేసే సవ్వడి ఆనందాన్ని నింపింది. అంత ఎత్తయిన ప్రదేశంపై కాలువ నీరు పారడానికి వెనుక గల ఇంజనీరింగ్‌ను చూడబుద్ధయి, కాలువ గట్టును పట్టుకొని బయల్దేరాను. విశాలమైన గుడి ఆవరణ చుట్టూ కాలువనీటి ప్రవాహం ఉరకలు వేస్తోంది. నీటి చలువ వల్ల, నీటిపారకం వల్ల ఏపుగా ఎదిగిన లతాగుల్మాదులు, వృక్షాలు దట్టంగా అల్లుకొని చల్లటి నీడను, గాలిని ప్రసాదిస్తున్నాయి. అక్కడ సేద తీరలేని మనిషి ఉండడం అరుదేమో!?. బలంగా సూర్య కిరణాలు పడకపోవడం వల్ల కలిగిన వాసన, మనిషిని ఆధునికతకు దూరంగా తీసు కెళ్తుంది. ఇటువంటి అనుభూతుల్ని అధిగమించి కాలువనీరు ఎక్కడినుంచి వస్తుందా అని పరిశీలించ సాగాను. దట్టమైన అల్లిక కారణంగా, ఏపుగా ఎదిగిన చెట్ల కారణంగా చూపు ముందుకు సాగలేదు. కంటికి కనిపించే చిత్తడి కారణంగా కాలు ముందుకు సాగలేదు. గుడి చుట్టూ తిరిగి గర్భ గుడిలో ప్రవేశించాను.

''ఈ కాలువ నీళ్లు ఎక్కడినుండి వస్తున్నాయి'' అక్కడున్న ఊరతన్ని అడిగాను.

''ఈ గుడి నుంచి మీదికి, ఒక మైలు దూరంలో చెరువుంది. ఆన్నుంచెల్లి కాలువచ్చి, గుడిమీద నుంచి పొలాలల్లకు పోతయి. ఆ పొలాల అవుతల కనపడేటియి ఈ ఊరు ఇండ్లే''

అతను చెప్పిన అమరికను చూడాలనిపించింది. ఇంతవరకు గుడికే పరిమితమైన నా చూపు కాలువ ప్రవాహంలో, పొలాలపైకి, పొలాల గుండా ఊర్లోని ఇండ్లవరకు ప్రసరించింది. చెరువు, కాలువ, పొలాలు, గుడి, ఊరు వీటన్నిటిని అనుసంధానించిన నా మనసుకు పురాతన గ్రామీణ వ్యవస్థ సాక్షాత్కరించింది. స్వయంసమృద్ధమైన పల్లెటూరి జీవనవిధానం స్ఫురించింది. పరస్పరాధారితాలైన కులవృత్తులు, వ్యవసాయం చెట్టాపట్టాలేసుకొని నడిచిన తీరు జ్ఞప్తికొచ్చింది. ఊరి పొలిమేరలో ఎత్తయిన ప్రదేశంపై వెలసిన ఆలయం, భూస్వామ్య వ్యవస్థ తాలూకు మడత కుచ్చిళ్లలో ఒదిగి వెలయించిన పెత్తనం గుర్తుకొచ్చింది. ఆ పెత్తనం నీడలో హాయిగా బతికిన అర్చకుల జీవనం కళ్ల ముందు కదలాడింది.


''గణ, గణ, గణ, గణ'' గంట మ్రోగింది.

ఆరగింపు మొదలైనట్టుంది. కాసేపటికి గోత్ర, వంశ నామాలు వినపడసాగాయి. వ్యక్తుల పేర్లతో అర్చన మొదలయింది. గుళ్లో నుండి నాకు పిలుపు వచ్చింది. అర్చనలో ఒకడిగా నిలిచాను. కళ్లముందు ''టపీ, టపీ'' మని పగులుతున్న కొబ్బరికాయలు, నేల పాలవుతున్న కులవృత్తుల లాగా కనిపించాయి. భక్తి భావంతో చెవులో పెడుతున్న పూల నుండి రాలి పడుతున్న పూరెక్కలు, పల్లెల ఆయువుపట్లు లాగా అనిపించాయి. శఠగోపం కోసం వంచిన నా తలలో చిట్లుతున్న శిథిల గ్రామం... వెళ్లేముందు గుళ్లో కాసేపు కూర్చోవడం జరిగింది. కొబ్బరి ముక్కలు నములుతూ, క్రమక్రమంగా గ్రామం కరిగిపోతున్న వైనాన్ని నెమరువేసుకోసాగాను. కాసేపటికి జీపు ప్రయాణం మళ్లీ మొదలయింది.

* * *

కాళేశ్వరం. కళ్ల ఎదురుగా గోదావరి. త్రివేణీ సంగమం. తీరాల్ని ఒరుసుకుంటూ ప్రవహించాల్సిన నది. సగంలో పారుతుండడం ఒక విషాదం. విశాలమైన నదిలో ఈదులాడడం, రోజువారీ స్నానకార్యాలకు భిన్నంగా ఉండడం వల్ల హాయి కలిగింది. ఒకనాడు అలవాటుగా చేసిన నదీస్నానం, ఈనాడు పవిత్ర కార్యంగా మారడం విశేషం. చల్లటి నీళ్లల్లో దిగి కూర్చోగానే రక్తనాళాలన్నీ సేద తీరినట్లనిపించింది. చిన్ననాడు వాగులో గంటల తరబడి స్నానించడం, రకరకాల ఇసుక గూళ్ళు కట్టడం, కూలగొట్టడం, ఇసుకలో 'కౌశిప్ప' ఆడడం, నీళ్లలో పిల్లిమొగ్గలు వేయడం అన్నీ గుర్తుకు రాసాగాయి. వాగులో చేపలు పట్టడం, పట్టిన చేపల్ని చెంబులో వేసుకొని వెళ్లడం, ఒకటేమిటి సమస్త విషయాలు, గొడవలు జ్ఞాపకం రాసాగాయి. గోదావరి అలలు, ఒకటొకటిగా శరీరాన్ని తాకు తుంటే గతించినవన్నీ కళ్లముందు కదలసాగాయి. వాగుల వల్ల కలిగిన సంతోషాలే కాక విషాదాలు కూడా గుర్తుకు రాసాగాయి.

ముప్పయి ఏండ్ల కింది ముచ్చట. మా ఊరి చుట్టూ వాగులు వర్షాకాలంలో పొంగి పొర్లేవి. వర్షాకాలం అన్ని రోజులు మాకు రాకపోకలకు



ఇబ్బందిగానే ఉండేది. ఆ రోజుల్లో కరీంనగర్‌లో చదువుకొనేవాణ్ణి. మా ఊరికి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలని ఊరు చేరాను. నేను వెళ్లిన రాత్రి కుంభవృష్టి కురిసింది. తెల్లవారి నేను పెట్టుకున్న ప్రయాణం వాయిదా పడింది. మా ఊరు చుట్టూ ఉన్న వాగులు నిండుగా పారుతున్నాయి. రెండు రోజులయింది. వరద తగ్గింది. అయినా ప్రవాహపు ఉరవడి తగ్గలేదు. నేను వెళ్లక తప్పదు. కనుక బయల్దేరాను. వాగు వరకు చేరాక భుజం మీదున్న బియ్యం సంచి, తలమీదికి మారింది. ప్యాంట్ విడిచి చంకలో పెట్టుకొని, చెప్పులు చేత పట్టుకొని వాగులో దిగాను. వాగు మధ్యకు వచ్చేసరికి, నడుము వరకు వచ్చిన నీటి ఉధృతి తట్టుకోవడం కష్టమయింది. నడుస్తున్న కాలుకింది ఇసుక కొట్టుకపోవడం, నీరు కాలును పైకి లేపుతుండడం వల్ల వాగులో నడవడం కష్టమయ్యేది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కొట్టుకు పోవడం ఖాయం. కొట్టుకుపోకుండా ఉండడం కోసం ఒకరి చేయి మరొకరం పట్టుకొని వాగు దాటడం జరిగేది.

''ఏయ్ పిలగా జర పైలం''

''కాలు లేపేవు. కొట్టుకపోతవు. కాలు రాక్కుంట నడువు''

''మీది మొకాన వాన పడ్తున్నట్టుంది. వాగు పొంగుతుంది''

''అర్జునా, ఫల్గుణా... అని సదువుకోండ్రి''

''ఈ యేడు మైసమ్మ ఎందర్ని హారం తీసు కుంటదో''

ఇటువంటి అనేక ముచ్చట్లు మాట్లాడుకుంటూ వాగుదాటేవాళ్లం. ఈ నాటి గోదావరి స్నానం గతం మొత్తాన్ని ముందుంచింది. కాని ఆనాటి జలసంపద ఏది? వర్షాలు ఏవి? చెరువులు- బావులు నిండడం, వాగు- వంక పొర్లడం, మత్తడి దుంకడం, బజార్లో పారే నీటిలో ప్రాజెక్టులు కట్టడం, పడవలుచేసి ఆడడం, ఒకటేమిటి చాలా ఆటలు మాయమయ్యాయి, వర్షం రాకపోవడంతో పంటేకాదు, ఆటపాటలు కూడా కనుమరుగయ్యాయి.

గోదావరి నుండి ఆది ముక్తేశ్వరుడి వరకు ప్రయాణం సాగింది. నగరానికి దూరంగా ఆది ముక్తేశ్వరుడు. గాలి సవ్వడి, ఆకుల గలగలలు, భూమి పొరల గుండా వడబోసి, వచ్చినట్లుగా ఉన్న తేట తేనియ లాంటి నీరు, శబ్ద కాలుష్యం లేని ప్రకృతి ఆహ్వానించింది. ఎత్తయిన వృక్షాల కింద, మనుషుల ఉపయోగం వల్ల నునుపు దాల్చిన శిలలు. వాటిని చూడగానే సేద తీరాలనిపించింది. మేను వాల్చగానే పత్రహరితం జోకొట్టింది. దూరంగా, గోదావరి మీదుగా, చెట్ల కొమ్మల కిందుగా వచ్చిన గాలి మనసును ఊయలలూపింది. ఛానల్స్‌కు అలవాటు పడ్డ చెవులు, ట్రాన్సిస్టర్ ట్యూన్‌కు పులకరించసాగాయి. లతామంగేష్కర్ గొంతులోని మధురిమ ప్రకృతికి చివుళ్లు తొడిగింది. చివుళ్లలోని పచ్చదనం కంటికి చల్లదనాన్నిచ్చింది. ఆ చలువతో కునుకు పట్టింది.

***

''చాలా విషయాలు న్యాయవ్యవస్థ జోక్యంతో పరిష్కారమవుతన్నాయి. నడుస్తున్నవి''

''వ్యక్తి తన బరువు, బాధ్యతలనుపట్టించుకోనట్లే, ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు''

''బరువు, బాధ్యతలనుపట్టించుకోని వ్యక్తిని, సమాజం పట్టించుకోనట్టే, పనిచేయని ప్రభుత్వాన్ని కోర్టులు కూడా పట్టించుకోని రోజులు వస్తయంటవా?''

''నమస్తే సార్'' వరుసగా నలుగురు ఆడవాళ్లు ఆఫీస్ రూంలోకి అడుగుపెట్టారు. మా మధ్య నడుస్తున్న వాదనకు బ్రేకుపడింది.

''ఎవరు మీరు''

''వంటవాళ్లం''

'' ఇక్కడేం పని''

''ఈ బల్లె మధ్యాహ్నం భోజనం వండడానికి మా గ్రూపుకు అవకాశం వచ్చింది''

''సరే. ఎప్పటి నుంచి వండతరు''

''రేపు వత్తం సారు'' అనుకుంటూ వెళ్లిపోయారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులతో మళ్లీ మొదలయిన మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌కు సంబంధించిన చర్చ మా కొలీగ్స్‌తో జరిగింది. అనేక బాలారిష్టాలను దాటి పథకం సాగుతోంది. వంటచేయడం గ్రూపుకు సంబంధించిన విషయం. ప్రతిరోజు ఎందరికి వండాలో తెల్పడం, రుచి, శుచి కలిగిన ఆహారం అందేలా చూడడం ప్రధానోపాధ్యాయుని విధి. విషయాల్ని అధికారులకు అందజేయడం మరో పని. ఒక రోజు...

''సార్ ఇవ్వాళ గ్రుడ్డు ఇస్తరా'' అబ్బాయి ప్రశ్న.

''నిన్ననే ఇచ్చేదుండే'' అమ్మాయి సందేహం.

''అవును. ప్రతి గురువారం ఇవ్వాలి అని నిర్ణయించుకున్నాం కదా'' అమ్మాయిని అనునయించాను.

''అసలు ఈ వారం ఇస్తరా సార్''

''ఎందుకు ఇవ్వలేదో నేను అడుగుత. రేపు తప్పనిసరిగ పెట్టిస్త'' పిల్లల్ని క్లాసులకు పంపించాను. నేరుగా వంటవాళ్ల వద్దకు వెళ్లాను. వాళ్లు వంట వండుతూ వున్నారు.

''నర్సమ్మా'' పిలిచాను.

''సార్'' అంటూ వచ్చింది.

''పిల్లలకు నిన్న గ్రుడ్డు ఇచ్చేదుండె, మరి ఇవ్వాళ కూడా ఇస్తలేనట్టుంది''

''పైసలు లెవ్వేసారు. వచ్చేవారం ఇద్దాం''

''పిల్లలు అడుగుతున్నరు. వారంలో ఒకసారి ఇవ్వాలనుంది కదా''

''పోరగాండ్లు అడిగేది నివద్దే. నువ్వు చెప్పేది నివద్దే. మేం కాదంటున్నామా. ఈ వంట జేత్తే మాకు పడ్తలేం పడుతలేదు. ముందుగాల పెట్టుబడి పెట్టాలె. తరువాత తీసుకోవాలె. పడ్తల పడందానికి పెట్టువడి పెట్టుడేంది. జరంత మీరు చూసి చూడనట్టు పోవాలె. మీరు మన్నిస్తేనే కదా మాకు బతుకు.

''మీకు ఇబ్బంది అయితుందని పిల్లలకు పెట్టక పోవడం సమంజసం కాదు. అందరూ పేద పిల్లలు. ఈ మధ్య కాలంలో మీ వంట కూడా నాసిరకంగా ఉంటుంది. దానికి కారణం లాభం లేకపోవడమా? అధిక లాభం కోరుకోవడమా?''

''గివన్ని మీరు పట్టిచ్చుకుంటె ఎట్లసారు. పెద్ద పులి చూపు ఉండాలి. గిట్ల అన్ని బల్లల్ల నడుత్తనే ఉన్నది. పెద్ద పెద్దోల్లే బస్తాలకు బస్తాలు మాయం జేసికి. గీసిన్నదానికి మమ్మల్ని నిలేత్తెట్ల. బక్కోల్ల మీద దయుంచాలె''

''ప్రపంచంల జరిగేవన్ని చెప్పి మీరు తప్పించుకో జూస్తే ఎట్ల. సాధ్యమైనంతవరకు మనం చక్కగుందాం. ఎట్లనైనా జేసి రేపు పిల్లలకు గ్రుడ్డు ఇవ్వాలె''

''గ్రుడ్డు ఇచ్చుడు ఇచ్చుడు. కని మాకు బియ్యం నెల నెలకు టైముకు వత్తున్నాయా. అవి రాకున్నా మేం తెచ్చి వండుతలేమా, వంట ఖర్చుకు పైసలు కూడా ఎన్కముందు వత్తున్నయి. గివన్ని ఎన్క ముందు అయినప్పుడు గ్రుడ్డు ఇచ్చుడు ఎన్క ముందు అయితేంది?''

''వెనకా, ముందు అయినా మీకు లెక్కప్రకారం అన్నీ అందుతున్నయి కదా. రెండు వారాల కోసారి గ్రుడ్డు ఇస్తే పిల్లలు ఒక వారంలో గ్రుడ్డు కోల్పోయినట్లే కదా''

''సారూ! మీరులెక్కలు మంచిగనే పెడుతరు''

''గ్రుడ్లు ఇవ్వడానికి మీరు, ఇప్పించడానికి నేను ఉన్నంక, పిల్లలకు ఇవ్వకపోవడం తప్పుకదా. తల్లి, తండ్రి ఉన్నాంక పిల్లలు అనాధలెట్లయితరు''

''ఎందుకు కారు. అసోంటోల్లు దునియా మస్తు మందున్నరు. ఎవరి ఖర్మ వాల్లది''

'' ఇంతకు నువ్వు అనదల్చుకున్నదేంది?''

''సారూ! నీకు కోపం వత్తుందని సమజయితుంది. అయినా మన్నించాలె. ఒక ప్రశ్న అడుగుత''

''అడుగు''

''వారంల బడి నడిసేది ఆరు రోజులు. ఆరు రోజులల్ల ఏదో ఒకరోజు మేం పిల్లలకు గ్రుడ్డు ఇవ్వాలె. అవునా''

''అవును''

''మరి ఈ వారంల బడి ఎన్ని రోజులు నడిసింది''

''మూడు రోజులు నడిసింది''

''అదె గట్లెందుకు నడిసింది''

''ఐచ్చిక సెలవులు రెండు. టి.సి. సమావేశం ఒకటి మొత్తం మూడు రోజుల బడి బంద్. మూడు రోజులు నడిసింది.''

''మరి మూడు రోజులకే పిల్లలకు గ్రుడ్లు

''గివన్ని మీరు పట్టిచ్చుకుంటె ఎట్లసారు. పెద్ద పులి చూపు ఉండాలి. గిట్ల అన్ని బల్లల్ల నడుత్తనే ఉన్నది. పెద్ద పెద్దోల్లే బస్తాలకు బస్తాలు మాయం జేసికి. గీసిన్నదానికి మమ్మల్ని నిలేత్తెట్ల. బక్కోల్ల మీద దయుంచాలె''

ఇచ్చుడా! మాకు లుక్సాన్ కాదా''

''వరుసగా సెలవులు వచ్చిందానికి ఎవరేం జేస్తరు. పని దినాల్ని అడ్డం పెట్టుకొని ఎగ్స్ ఇవ్వడం ఎగ్గొడితె ఎట్ల''

''ఆ పేరుచెప్పి, ఈ పేరు చెప్పి మీరు బడికి ఒక్కపూట సెలవు కూడా ఇచ్చుకుంటరు కదా. మీకు సెలువు ఉంటే మంచిగ అనిపిస్తది. మాకు బడి ఉంటే మంచిగ అనిపిస్తది. ఎందుకంటే మాకు పనిచేస్తేనే పడ్తల ఉంటది. పనిచేయని పొంటెకు పండుడే నాయె''

''మీరు అనేదేదో సూటిగా అనండి''

''మీకు ఏం తెల్వనట్లు, సమజ్‌గానట్లు మాట్లాడ్త రేంది. మీరేదో నష్టపోతున్నట్లుకనపడ్తరేంది. ఒక్కసారి పెట్టపోతె కొంపలు కూల్తయా? జరంత మీరు ఊర్కోండ్రి''

''అర్థమయింది. వ్యక్తిగత లాభనష్టాలు బేరీజు వేసుకొని వ్యవస్థ నడుపుతె, అది కుంటిదవుతుంది. ఇంత చర్చ అనవసరం. రేపు పిల్లలందరికీ ఎగ్స్ ఇవ్వండి''

''మంచిది'' కోపంగా, విసురుగా వెళ్లింది.

ఆమె వెళ్లిన కాసేపటికే పొయ్యిలోని పొగ దట్టంగా నన్ను అలుముకుంది. వాయు కాలుష్యానికి ఉక్కిరిబిక్కిరి అయ్యాను. హిస్నోఫిల్ విజృంభించింది. ఆయాసం ఎక్కువైంది. అప్పుడే నా వెనుక నుండి 'కిలకిలా' నవ్వులు వినిపించాయి. వెనక్కి తిరిగి చూశాను. తెల్లటి స్కూల్ యూనిఫామ్‌లో పాలిపోయినట్లుగా బడి పిల్లలు. చిత్రంగా వాళ్లు గాలిలో తేలియాడసాగారు. అందులో ఒకరు.

''వణక్కం అంకుల్'' పలకరించింది.

''మీరంతా ఎవరు''

''పూర్వాశ్రమంలో మేమంతా బడిపిల్లలం. వంటశాల వల్ల మాడిన విద్యార్థులం.''

''చూడబోతే మీది ఈ ప్రాంతం కానట్టని పిస్తుంది.''

''అవును.మాది తమిళనాడులోని కుంభకోణం''

''మీరు ఇక్కడికెందుకొచ్చినట్లు''

''దేశంలోని అన్ని బళ్లల్లో వంటశాలల పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుసుకోవడం కోసం తిరుగుతున్నం''

''తిరిగి మీరు ఏం చేస్తరు''

''యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తయారు చేస్తం''

''మీ యాక్షన్ ఎవరిమీద''

''వ్యవస్థ మీద, వ్యక్తుల మీద''

''వ్యక్తులు వ్యవస్థలో భాగం కాదా''

'కాదు. ఇప్పుడు వ్యవస్థ, వ్యక్తికలిసిన్నట్టు ఉంటూనే విడిగా బ్రతుకుతున్నారు. ''

''మీరు పిల్లలు. మీకేం తెలియదు''

''అది మీ టీచర్ల మూస ధోరణి. ఇప్పుడు మేం పిల్లల రూపంలో ఉన్న పెద్దలం'' అంటూ మాయమయ్యారు.

మెలకువ వచ్చింది. కళ్లు తెరిచి చూసేసరికి మా వాళ్లందరూ తిరుగు ప్రయాణానికి తయారయ్యారు. లేచి తయారు కాసాగాను. రేడియోలో సిలోన్ నుండి పాత పాటలు వినిపిస్తున్నాయి. పాట వింటూ జీపులో వచ్చి చేరాను. తిరుగు ప్రయాణం మొదలయింది. ఉదయం నుండి సాయంత్రం వరకు నిన్ను ప్రభావితం చేసిన దృశ్యాల గుండా, స్థలాల మీదుగా, ప్రకృతి మధ్యగా ప్రయాణం సాగుతుంది. తలలో కుంభకోణం విద్యార్థులు సంధించిన విషయాలు సలుపుతున్నవి. ఉదయం నుండి వేధిస్తున్న విషయాలు కుంభకోణాల పిల్లల మాటల వెలుగులో కొత్తగా అర్థమవసాగాయి. ఊరు తన సమిష్టితత్వాన్ని కోల్పోయింది. ఊర్లో మనుషుల మధ్య సహజంగా ఉన్న బంధం తెగగొట్టబడింది. ఊరు ఒంటరిగా మారి పరాధీనంగా మిగిలింది. వ్యక్తి వికాసానికి అండగా నిలవాల్సిన పాఠశాల, మార్కెట్ భావజాలంతో జోగడం వల్ల కుంభకోణం ఘటన రికార్డయింది. మనిషి, వ్యవస్థ ప్రైవేటైజ్ కాక తప్పదనే పరిస్థితులు, కాకపోతే బతుకు గడవదనే భావనలు బలపడుతున్నవి.

''ఏం సంగతోయ్ మాట లేదు, ముచ్చటలేదు'' మా వాళ్లలో ఒకరి మందలింపు.

''ఊరికే ఆలోచించడం మంచిది కాదు'' మరొకరి సలహా.

''నలుగురిలో ఉన్నప్పుడుకలిసిమెలసి మాట్లాడుతూ ఉండాలె'' ఒకరి తీర్మానం. ఇలా రకరకాల వ్యాఖ్యానాలు. వాటన్నిటికి సమాధానంగా ఒక నవ్వు. హిపోక్రసీ, ఎలియనేషన్ జీవనమార్గంగా సాగుతున్నవేళ, అడవిలో మట్టి తింటూ జీవనం సాగించే మనిషి పారదర్శకంగా కనిపించసాగాడు.

★



## బాడీబిల్డర్

సోనాలీ బింద్రే మనకు తీగలా అందంగా కనిపించడం వెనుక రుజ్జుతా దివ్వేకర్ కృషి వుంది. ముంబైలో పర్సనల్ ట్రయినర్‌గా పెద్దపేరు తెచ్చుకున్న ఈ అమ్మాయి క్లయింట్‌లు చాలా పెద్దవాళ్లు. అందులో అనిల్ అంబానీ కూడా ఒకరు. ముంబైలో పెద్ద జిమ్ నడుపుతున్న రుజ్జుకి హృతిక్ అంటే అభిమానం. హృతిక్ సినిమాలు విడుదలైన తర్వాత జిమ్‌కి వచ్చే యూత్ సంఖ్య మూడింతలు పెరిగిందట. నిరంతరం యవ్వనంగా వుండాలంటే వ్యాయామం తప్పని సరి అంటోంది.